సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



జోరుగా గంజాయి దందా!

జిల్లా మీదుగా జోరుగా గంజాయి రవాణా సాగుతోంది. పోలీసులు నిఘా పెట్టినా వాహనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని తరలిస్తున్నారు. 8లో



మునగ సాగు లాభదాయకం

మునగ సాగు లాభదాయకమని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. గురువారం మణుగూరు, పినపాక మండలాల్లో పర్యటించారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 32° / 21°

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రిపూట వాతావరణం మాత్రం కొంతమేర చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం నివేదన సమర్పించి మంత్రపుష్పం, హారతి అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు 96 మంది హాజరు కాగా వీరిలో 45 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు. మేడ్చల్‌లోని కేఎల్ గ్రూప్స్‌లో ఉద్యోగాల భర్తీకి కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేశారని వెల్లడించారు. కాగా, ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

తొలి డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



లైబ్రరీని ప్రారంభిస్తున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని జిల్లా కోర్టులో తొలి డిజిటల్ లైబ్రరీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలి డిజిటల్ లైబ్రరీని కొత్తగూడెం కోర్టులో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. జూనియర్ న్యాయవాదులు డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు గొల్లపూడి భానుమతి, ఎ. సుచరిత, బార్ అసోసియేషన్ బాధ్యులు లక్కినేని సత్యనారాయణ, తోట మల్లేశ్వరరావు, ఎంఎస్‌ఆర్ రవిచంద్ర, ఎస్. ప్రవీణ్, గ్రంథాలయ కార్యదర్శి ఎండీ సాధిక్‌పాషా, క్రీడల కార్యదర్శి దూదిపాల రవికుమార్, మహిళా ప్రతినిధి నల్లమల్ల ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సీజన్ నాటికి యంత్రాల మరమ్మతులు

ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి



గెలల క్రషింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ ఫ్యాక్టరీల్లో వినియోగిస్తున్న యంత్రాలు పటిష్టంగా పని చేసేందుకు అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ఉన్నతాధికారుల నుంచి అనుమతితో వచ్చే సీజన్ నాటికి పనులు పూర్తి చేస్తామని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ప్లాంట్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీలను సందర్శించారు. గెలల క్రషింగ్ యంత్రాల పనితీరు, మరమ్మతుల గురించి సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కల్యాణ్, ఇంజనీర్లు పాల్గొన్నారు.

హామీలు ఘనం.. అభివృద్ధి శూన్యం



కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీకి ఎప్పటికప్పుడు కొత్తపేరు !

- గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక కమిటీ వేసిన కేసీఆర్
- జేఎన్‌టీయూ 'యూనివర్సిటీ'గా గుర్తించాలన్న ఎమ్మెల్యే కూనంనేని
- యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చాలన్న మంత్రి తుమ్మల
- ఒకప్పటి స్కూల్ ఆఫ్ మైన్స్‌ను కనీసం పట్టించుకోని సింగరేణి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా అప్‌గ్రేడ్ చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఇదే కాలేజీని కాకతీయ యూనివర్సిటీ పరిధి నుంచి తప్పించి, జేఎన్‌టీయూ పరిధిలోకి తెచ్చి యూనివర్సిటీ హోదా కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఈ కాలేజీ అభివృద్ధికి అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక కమిటీని నియమించారు. కాలక్రమేనా పేర్లు మారుతున్నాయి, హామీలు గుప్పిస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో అభివృద్ధి, నిర్వహణ అంశాల్లో దీని పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంది.

గతంలో కేసీఆర్ హామీ

జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ప్రారంభోత్సవం సందర్భంగా 2023 జనవరి 12న నాటి సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కేయూసీఈ) అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రొఫెసర్ గోపాల్ నాయక్ (సివిల్ ఇంజనీరింగ్, ఓయూ), ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి (మెకానికల్, జేఎన్‌టీయూ), పి. రామయ్య(కేయూ)తో కలిపి 2023 ఫిబ్రవరి 4న నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రస్తుత అవసరాలు, భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా కాలేజీలో సౌకర్యాలు కల్పించేందుకు రూ.75 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అదే ఏడాది ఫిబ్రవరి 16న ప్రభుత్వానికి నివేదించింది.

తొలి దశలో రూ.51 కోట్లతో

కాలేజీలో భవిష్యత్‌లో ఆరంభించబోయే కోర్సుల ఆధారంగా రూ. 51.31 కోట్లతో కొన్ని నిర్మాణ పనులు అత్యవసరంగా చేపట్టాలని నిపుణుల కమిటీ సూచించింది. కమిటీ సిఫార్సులు ప్రభుత్వానికి అంది 20 నెలలవుతున్నా ఇప్పటికీ ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. మరోవైపు ఇదే కాలేజీకి చెందిన స్థలంలోనే సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాల సముదాయం నిర్మించారు. ఎస్పీ ఆఫీసు నిర్మాణంలో ఉంది. ఈ భూములకు సంబంధించిన పరిహారం కూడా కాలేజీకి ఇంతవరకూ అందలేదు. ఇక మైనింగ్ కోర్సు కోసమే ప్రారంభమైన ఈ కాలేజీకి దశాబ్ద కాలంగా సింగరేణి సహకారం సైతం కరువైంది. ఇటు సీఎస్సార్, అటు ప్రత్యేక నిధులు కూడా రావడం లేదు. ఫలితంగా కాలేజీలో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ పని చేయాల్సిన సిబ్బంది, అధ్యాపకులు డిప్యుటేషన్‌పై వరంగల్ వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికైనా ఈ కాలేజీ అభివృద్ధి, అప్‌గ్రేడేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఉంది.

కాలేజీ నేపథ్యం ఇదీ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1957లో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ (హైదరాబాద్)లో మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత మైనింగ్ విభాగాన్ని 1976లో సింగరేణి బొగ్గు గనులు ఉన్న కొత్తగూడేనికి తరలించారు. అప్పట్లో కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌గా ఈ కాలేజీని పిలిచేవారు. 1994లో ఓయూ నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలోకి మారింది. ప్రస్తుతం ఈ కాలేజీలో గ్రాడ్యుయేషన్ విభాగంలో మైనింగ్, ఈఈఈ, కంప్యూటర్ సైన్స్‌తో పాటు సెల్ఫ్ ఫైనాన్స్ కింద ఈసీఈ, ఐటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అన్ని విభాగాల్లో కలిసి 250 సీట్లు ఉన్నాయి. వీటితో పాటు 2001 నుంచి ఎంబీఏ, ఎంసీఏ వంటి పీజీ కోర్సులకు కూడా అవకాశం కల్పించారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల్లో విద్యాపరంగా ఎలాంటి యూనివర్సిటీ లేని జిల్లాగా ఉమ్మడి ఖమ్మం మిగిలిపోయింది. అయితే ఇటీవల కొత్తగూడెంలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీకి యూనివర్సిటీ హోదా ఇవ్వాలనే డిమాండ్ పెరిగింది.

ఇతర పనుల ప్రతిపాదనలు

- రూ.1.70 కోట్ల వ్యయంతో ప్రస్తుతం ఉన్న అకడమిక్ బ్లాక్ –2లో 430 చదరపు మీటర్ల వైశాల్యంతో పైఅంతస్తు నిర్మాణం
- రూ. 80 లక్షల వ్యయంతో ప్రస్తుతం ఉన్న బాల, బాలికల హాస్టళ్ల మరమ్మతులు
- ఒక్కో విభాగానికి రూ.కోటి చొప్పున రూ.5 కోట్లతో ల్యాబొరేటరీ ఎక్విప్‌మెంట్ల కొనుగోలు
- రూ.5 కోట్ల వ్యయంతో ల్యాబొరేటరీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- రూ.10 కోట్ల వ్యయంతో కాలేజ్ క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం

నిపుణుల కమిటీ అత్యవసరంగా చేపట్టాలని సూచించిన పనులు

పని	సామర్థ్యం	అంచనా వ్యయం
బాలుర హాస్టల్	500	రూ. 21.50 కోట్లు
బాలికల హాస్టల్	300	రూ. 14.60 కోట్లు
వర్క్‌షాప్ షెడ్లు	4	రూ. 5.21 కోట్లు
అకడమిక్ బ్లాక్	జీ ప్లస్ 1	రూ. 7.40 కోట్లు
ఓల్డ్ అకడమిక్	విస్తరణ	రూ.1.60 కోట్లు
ఏఐసీటీ బ్లాక్	జీ ప్లస్ వన్	రూ. 50 లక్షలు
మరమ్మతులు, నిర్వహణకు		రూ. 50 లక్షలు
మొత్తం		రూ. 51.31 కోట్లు

అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్, పక్కన ఎమ్మెల్యే కూనంనేని, ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం) : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. స్థానిక ఐడీఓసీలో గురువారం ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు చట్టప్రకారం ఉన్న హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని చెప్పారు. వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు.33 శాతం సబ్సిడీతో వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో పథకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరగా.. ఈ విషయం హైకోర్టు పరిధిలో ఉంటుందని, జిల్లా జడ్జికి వినతిపత్రం అందిస్తామని కలెక్టర్ వివరించారు. జిల్లా ఏర్పాటు సమయంలో అప్పటి కలెక్టర్ చుంచుపల్లిలో సేవాలాల్ ధ్యాన మందిరం ఏర్పాటుకు స్థలం కేటాయించారని, కానీ ఇప్పటివరకు కార్యాచరణ రూపొందించలేదని సభ్యులు కలెక్టర్ దృష్టికి తేగా.. పరిశీలించాలని చుంచుపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఐటీడీఏఈ ఏపీఓ జనరల్ డేవిడ్రాజు, బీసీ సంక్షేమాధికారి అనసూయ, డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, సీపీఓ సంజీవరావు, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు ఎనుమురి లక్ష్మీబాయి, చింతల రవికుమార్, లావుడియా సామ్య, లకావత్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న జిల్లా విద్యార్థులు

- ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఐటీడీఏ విద్యార్థులు

పాల్వంచరూరల్ : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన విద్యార్థుల క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. పోటీలకు జిల్లా నుంచి 248 మంది విద్యార్థులు హాజరైన విషయం విదితమే. బాల, బాలికలకు కిన్నెరసాని, కాచనపల్లి క్రీడా పాఠశాలల్లో వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వగా అద్భుత ప్రతిభ చాటి జిల్లాకు, ఐటీడీఏకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. ఐటీడీఏల పరిధిలో ఇప్పటివరకు ఐదుసార్లు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించగా, జిల్లా విద్యార్థులు నాలుగుసార్లు ప్రథమ స్థానంలో నిలవడం విశేషం.

ఈ క్రీడల్లో విజేతలుగా..

అండర్ –14, 17 వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ పోటీల్లో జిల్లా బాలికల జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలవగా, టెన్నికాయిట్‌లో అండర్– 14 జట్టు తృతీయ స్థానం, అండర్ –17 జట్లు ప్రథమ స్థానం సాధించాయి. ఇక చదరంగంలో ప్రథమ, ద్వితీయ, క్యారమ్స్‌లో అండర్– 14 విభాగం ప్రథమ బహుమతి గెలుచుకున్నాయి. ఇంకా 100, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 400 మీటర్ల పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచారు. హైజంప్, లాంగ్‌జంప్‌లోనూ ప్రథమ స్థానం సాధించి చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. వాలీబాల్ అండర్ –14 బాలుర విభాగంలో ప్రథమ, అండర్ –17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. కబడ్డీ, ఆర్చరీ అండర్ 14, 17 విభాగాల్లో ప్రథమ, ఖోఖోలో అండర్ –14 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. టెన్నికాయిట్‌లో అండర్ 14, 17 విభాగాల్లో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. చెస్‌లో అండర్ –17 విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారు.

మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి



జూలూరుపాడు మార్కెట్‌లో పత్తిని పరిశీలిస్తున్న జేడీఎం, అధికారులు

జూలూరుపాడు: మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చే పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు వ్యాపారులకు సూచించారు. జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను గురువారం ఆయన డీడీ పద్మావతితో కలిసి పరిశీలించారు. అనంతరం జేడీఎం మాట్లాడుతూ అధిక వర్షాలు, ఇతర కారణాలతో పత్తి దిగుబడి తగ్గిన నేపథ్యాన రైతులు మరింత నష్టపోకుండా మద్దతు ధర చెల్లించాలని సూచించారు. అనంతరం మార్కెట్ యార్డుకు కేటాయించిన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించగా, మార్కెట్ నిర్మాణంపై వ్యాపారులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, ఏన్కూరు మార్కెట్ కార్యదర్శి బజారు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విద్యార్థులను తీర్చిదిద్దాలి



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి విద్యాసంస్థల్లో మెరుగైన బోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ గురువారం హైదరాబాద్‌లో సీఎండీని కలవగా పలు అంశాలపై మాట్లాడారు. సింగరేణి పాఠశాలల్లో ఒలింపియాడ్ ప్రవేశపెట్టడం, జూనియర్ కళాశాలలో జేఈఈ, నీట్‌కు బోధన, రామగుండం పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టనుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, 1975లో ప్రారంభమైన సింగరేణి మహిళా కళాశాలకు వచ్చే ఏడాది 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సీఎండీ సూచించారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే తెల్లం, పీఓ రాహుల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావు, పక్కన పీఓ తదితరులు

భద్రాచలంటౌన్: మారుమూల ప్రాంత గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్త పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, సిటీ స్కాన్ మిషన్లు అందుబాటులోకి తేవాలని, అవసరమైన చోట బైక్ అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఐటీడీఏ ప్రాంగణంలో ఏజెన్సీ డ్రగ్స్ స్టోర్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో టీ హబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓ భాస్కర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, చైతన్య, ఈఈ తానాజీ, రవిబాబు, హరీష్ పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తువులు సరఫరా చేయాలి

ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసే వస్తువులు నాణ్యంగా ఉండాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఖమ్మం జిల్లాలోని పాఠశాలలకు బీరువాలు, డైనింగ్ సెట్లు సరఫరాకు సంబంధించిన టెండర్ ప్రక్రియను గురువారం ఆయన తన చాంబర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీరువాలు డైనింగ్ సెట్లు సరఫరా చేయడానికి వరంగల్, భద్రాచలం, ఖమ్మం, నల్గొండ నుంచి టెండర్లు వచ్చాయని, తక్కువ ధరకు కోట్ చేసిన వారి టెండర్లు ఆమోదించామని తెలిపారు. నాసిరకం సామానులు సరఫరా చేసినట్లు తెలిస్తే ఏజెన్సీలను రద్దు చేయడంతో పాటు వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖమ్మం డీడీ విజయలక్ష్మి, జీసీసీ డీఎం సమ్మయ్య, సత్యవతి పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాచలం : అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. భద్రాచలంలోని చెక్‌పోస్టును గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బంది రేడియం జాకెట్లు ధరించాలని, భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట టౌన్ సీఐ సంజీవరావు, ఎస్‌ఐలు మధుప్రసాద్, విజయలక్ష్మి ఉన్నారు.

పేరుకుపోయిన బూడిద

- చెరువుల నుంచి తరలింపులో జెన్‌కో నిర్లక్ష్యం
- దరఖాస్తుదారుల్లో 39 మందిని ఎంపిక చేసిన ఐటీడీఏ పీఓ
- నెల దాటినా అనుమతి ఇవ్వని అధికారులు
- అధిక కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



నిండిన కేటీపీఎస్ బూడిద చెరువు

పాల్వంచ : పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో బూడిద నిల్వలు నిండిపోయాయి. విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న క్రమంలో వెలువడే బూడిదతో చెరువులు నిండి పొర్లిపోతున్నాయి. దీంతో అధిక కాలుష్యం వెలువడి పరిసర ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. బూడిదను ఎప్పటికప్పుడు తరలించడంలో జెన్‌కో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బూడిద తరలింపునకు దరఖాస్తు చేసుకున్న వారిలో 39 మందిని ఐటీడీఏ అధికారులు ఎంపిక చేసినా.. వారికి అనుమతులు ఇవ్వడంలో యాజమాన్యం తాత్సారం చేస్తోంది.

సామర్థ్యానికి మించి నిల్వ..

కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో 5,6 దశల కర్మాగారాల్లో 9, 10, 11 యూనిట్ల ద్వారా 1,000 మెగావాట్లు, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 7వ దశ 12వ యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇవి థర్మల్ కేంద్రాలు కావడంతో బొగ్గును మండించి ఉత్పత్తి చేస్తారు. దీంతో అధికంగా బూడిద వెలువడుతుంది. దీన్ని బూడిద చెరువులకు తరలిస్తుంటారు. 5, 6 దశల పరిధిలో ఏబీ పాండ్ అడిషనల్ పాండ్ ఉన్నాయి. 7వ దశ పరిధిలో నార్తర్న్ యాష్ పాండ్ – 1, 2 ఉన్నాయి. అయితే ఈ నాలుగు చెరువులూ ప్రస్తుతం నిండిపోయాయి.

ఎంపిక చేసినా దక్కని అనుమతి

బూడిద తరలింపునకు తమకు అవకాశం ఇవ్వాలని కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లోని ముగ్గురు వ్యక్తులు కోర్టును ఆశ్రయించగా, వారికి అనుమతి ఇవ్వాలని కోర్టు జెన్‌కో యాజమాన్యాన్ని ఆదేశించింది. అయితే ఈ ముగ్గురిలో ఒకరు మాత్రమే ఒప్పందం కుదుర్చుకుని రోజుకు 2,500 టన్నుల బూడిద తరలిస్తున్నట్లు తెలిసింది. కాగా, బూడిద తరలింపునకు ముందుకు రావాలంటూ కాలుష్య ప్రభావిత ప్రాంతాలైన కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం ప్రాంతాల గిరిజన అభ్యర్థుల నుంచి ఐటీడీఏ పీఓ రాహుల్ సెప్టెంబర్ 14న దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో 77 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 39 మందిని ఎంపిక చేశారు. వారి వివరాలను జెన్‌కో యాజమాన్యానికి పీఓ అందజేశారు. అయితే నెల రోజులు దాటినా వారికి అనుమతులు ఇచ్చే విషయంలో జెన్‌కో తాత్సారం చేస్తోంది. దీంతో కొందరు రెండు రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. ఇక కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లోని కొందరు గిరిజనేతరులు సైతం బూడిద తరలింపుపైనే ఆధారపడి జీవిస్తున్నామని, తమకు కూడా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

చెరువు ఎత్తు పెంపులో జాప్యం

కేటీపీఎస్ నార్తర్న్ యాష్ పాండ్ 104 మీటర్ల ఎత్తు ఉండగా పెరుగుతున్న బూడిద నిల్వల కారణంగా మరో ఐదు అడుగుల ఎత్తు పెంచే పనులను గతేడాది నవంబర్‌లో రూ.25 కోట్లతో చేపట్టారు. అయితే ఈ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కట్ట ఎత్తు పెంచేందుకు మట్టి, ఇసుక తదితర సామగ్రిని సకాలంలో చేర్చేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అందుకే జాప్యం జరుగుతోందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఏడాదిలోగా పనులు పూర్తి కావాల్సి ఉండగా, వచ్చే జూన్ వరకు సమయం పట్టొచ్చని తెలుస్తోంది. ఇక కొత్త కర్మాగారం ప్రతిపాదన అమల్లోకి వస్తే ఇప్పుడున్న బూడిద చెరువులు ఏ మాత్రం సరిపోవని స్థానికులు అంటున్నారు. దీనిపై జెన్‌కో డైరెక్టర్ ఎ.అజయ్‌ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

కాలుష్యం బారిన ప్రజలు..

బూడిద తరలింపులో జెన్‌కో అధికారుల నిర్లక్ష్యంతో భారీగా నిల్వలు పేరుకుపోయాయి. ఒక్కో కర్మాగారం పరిధిలోని చెరువుల్లో 5 కోట్ల టన్నులకు పైగా బూడిద నిల్వలు ఉన్నాయి. దీంతో అధిక కాలుష్యం వెదజల్లుతోంది. పాల్వంచ పట్టణంతో పాటు సూరారం, పాండురంగాపురం, కరకవాగు, పునుకుల తదితర ప్రాంతాల్లో అధికంగా కాలుష్యం వెలువడుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బూడిదను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో కాలుష్య నియంత్రణ శాఖ కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతం, రసాయన శాస్త్రం బోధించేందుకు ఆసక్తి కలిగినవారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పంటల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని వెంకటాపురంలో గిరిజనులు సేద్యం చేస్తున్న పోడు భూముల్లోని పంటలను ఐటీడీఏ భద్రాచలం ఏపీఓ (జనరల్) డేవిడ్‌రాజ్ గురువారం పరిశీలించారు. బోర్లు వేసినా విద్యుత్‌లైన్ లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని బాధిత గిరిజన రైతులు ఇటీవల ఐటీడీఏ పీఓ రాహుల్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం చంద్రుగొండలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దీంతో ఐటీడీఏ పీఓ ఆదేశాలతో ఏపీఓ పోడు భూములను సందర్శించారు. విద్యుత్‌లైన్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. డీటీఆర్వో ఎఫ్ లక్ష్మీనారాయణ, ఎఫ్ఆర్ఓ ఎల్లయ్య పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, అధికారులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : ఈ నెల 18 నుంచి మూడురోజులపాటు అన్నపురెడ్డిపల్లిలోని గురుకుల కళాశాలలో నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. కళాశాలలో గురువారం సాయంత్రం ఆయన వైజ్ఞానిక ప్రదర్శన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, డీఎస్ఓ ఎస్.చలపతిరాజు, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పర్సా వెంకట్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

జూలూరుపాడు: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ పేషెంట్లతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు దంత వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు డెంటల్ డాక్టర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు, యూడీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ


వివరాలు పరిశీలిస్తున్న రవీందర్‌రావు

ఇల్లెందు: ఇల్లెందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా అధికారి ఎం.రవీందర్‌రావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం కోసం పట్టణంలోని పలు భవనాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ఆయన వెంట ఇల్లెందు సబ్ రిజిస్ట్రార్ సుమలత ఉన్నారు.

తరగతి గదిలో పాము కలకలం

సుజాతనగర్: సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తాచుపాము కలకలం రేపింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. 10వ తరగతి బీ.సెక్షన్‌లో టీచర్ పాఠం చెబుతున్న సమయంలో అకస్మాత్తుగా ఓ పాము తరగతి గదిలోకి ప్రవేశించింది. పాము వచ్చిన విషయాన్ని టీచర్ ఇతర ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు వచ్చి చంపేశారు.

మెకానిక్ ఆత్మహత్య

కొత్తగూడెంటౌన్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మెకానిక్ గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. అరెల్లి సతీష్ (40) గౌతంపూర్‌లో నివాసం ఉంటూ బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనోవేదనకు గురై ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

జోరుగా గంజాయి దందా!

- అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్న పోలీసులు
- రవాణాకు కొందరు సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు
- జిల్లా వ్యాప్తంగా గత 10 నెలల్లో 7,787.712 కేజీలు స్వాధీనం
- 236 మంది నిందితులు అరెస్ట్, పరారీలో 209 మంది..


గత మే 27న కొత్తగూడెం ఓల్డ్ డిపో వద్ద రూ. 1.30 కోట్ల విలువైన 429 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: జిల్లా మీదుగా జోరుగా గంజాయి రవాణా సాగుతోంది. పోలీసులు నిఘా పెట్టినా వివిధ వాహనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుని తరలించుకుపోతున్నారు. కొన్ని సంఘటనల్లో నిందితులు పట్టుబడుతూనే ఉన్నారు. జిల్లాలో గత 10 నెలల్లో దాదాపుగా 88 కేసులు నమోదయ్యాయి. రూ. 19,46,92,800 విలువైన 7,787.712 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా కేసుల్లో 445 మందికి సంబంధం ఉండగా, వారిలో ఇప్పటివరకు 236 మందిని అరెస్ట్ చేశారు. మరో 209 మంది పరారీలో ఉన్నారు. గత సెప్టెంబర్‌లో అధికంగా 11 కేసుల్లో 999.712 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 24 మందిని అరెస్ట్ చేశారు. జూలైలో 4 కేసుల్లో 90.356 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని 13 మందిని అరెస్ట్ చేశారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నా పోలీసుల కళ్లుగప్పి గంజాయి రవాణా చేస్తున్నారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీల నుంచి జిల్లాలోని చర్ల, అశ్వారావుపేట, భద్రాచలం తదితర ప్రాంతాల మీదుగా విజయవాడ, హైదరాబాద్, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, కోల్‌కతా వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే గంజాయి రవాణాకు కొందరు పోలీసులు కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పూర్తిస్థాయిలో గంజాయి రవాణాను అరికట్టడంలో జిల్లా పోలీసులు విఫలమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

ఇటీవల కొన్ని సంఘటనలను పరిశీలిస్తే..

గత మే నెలలో అశ్వారావుపేటలో పనసలోడు ముసుగులో బొలెరో వాహనంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు రూ.83 లక్షల విలువైన 3.5 క్వింటాళ్ల గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

- మే 27న కొత్తగూడెం ఓల్డ్ డిపో వద్ద డీసీఎంలో తరలిస్తున్న రూ. కోటీ 30 లక్షల విలువైన 429 కేజీలు గంజాయిని పట్టుకున్నారు.
- సెప్టెంబర్ 15న ఏటీబీ నుంచి తమిళనాడుకు అంబులెన్స్‌లో తరలిస్తున్న రూ. 2 కోట్ల విలువైన గంజాయిని కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం జాతీయరహదారిపై పట్టుకున్నారు.
- అక్టోబర్ 28న ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.
- ఈ నెలలో వారంరోజుల్లో రెండు ఘటనల్లో 110.205 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, 8 మంది పరారీలో ఉన్నారు.

కేసులు నమోదు చేస్తాం



జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. జిల్లావ్యాప్తంగా చెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా పెట్టాం. గంజాయి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. రవాణా చేసినా, కలిగి ఉన్నా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. వివరాలు తెలిస్తే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి.

–బి.రోహిత్‌రాజు, ఎస్పీ

మునగ సాగు లాభదాయకం

డీఆర్‌డీఓ విద్యాచందన


మునగసాగుపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

మణుగూరుటౌన్/మణుగూరు రూరల్/పినపాక: మునగ సాగు లాభదాయకమని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. గురువారం ఆమె పినపాక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, రైతులతో, మణుగూరు మండలం గుట్టమల్లారం రైతు వేదికలో మునగ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మునగసాగుపై దృష్టి సారించి ఆదాయం, ఆరోగ్యం పొంది ఆర్థిక పరిపుష్టి సాధించాలని సూచించారు. మునగ సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరాకు రూ.1,25,000 వరకు ప్రభుత్వం సహాయం లభిస్తుందన్నారు. ఎకరాకు వెయ్యి మొక్కలు నాటవచ్చని చెప్పారు. అంతరపంటగా పుట్టగొడుగుల పెంపకం, పామాయిల్, తేనేటీగల పెంపకం, గుంటలు తవ్వి కొర్రమీను చేపల పెంపకం, నాటు కోళ్ల పెంపకం, కూరగాయల సాగు కూడా చేపట్టవచ్చన్నారు.

మునగ ఆకుల పొడితో ఆయుర్వేద మందుల తయారీకి, మునగ విత్తనాల నుంచి వచ్చే ఆయిల్ లీటర్ రూ.600 చొప్పున బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకోవచ్చన్నారు. పండ్లు, కూరగాయల సాగుతో కూడా ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం ముత్యాలమ్మ నగర్ పంచాయతీలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్‌ను పరిశీలించారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. 100 పడకల ఆస్పత్రిలో మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓలు టి.శ్రీనివాసరావు, రామకృష్ణ, తహసీల్దార్ నరేష్, ఏడీఏ తాతారావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏపీఎంఓ అహ్మదుల్లా, ఏఈఓ లక్ష్మణరావు, రైతులు కూచిపూడిబాబు, పాతూరి వెంకన్న, జగన్, కొజు మోహన్‌రావు, ఊకే వీరయ్య, నెల్లూరి నర్సింహారావు, మేడ నర్సింహారావు, మునిగెల భిక్షం, తోటకూరి గోపయ్య తదితరులు ఉన్నారు.

హామీలపై ప్రశ్నిస్తాం.. నిలదీస్తాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు


మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన హరిప్రియ, దిండిగల తదితరులు

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేవరకూ ప్రశ్నిస్తూనే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ స్పష్టం చేశారు. మండలంలోని సుభాష్‌నగర్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఏడాది గడవక ముందే ప్రజల వద్దకు వెళ్లకుండా ముఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, రైతు భరోసా చెల్లించలేదని, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించే ధైర్యం కూడా కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా తాము భయపడేది లేదని అన్నారు. తాము కూడా పింక్‌బుక్ పెట్టుకున్నామని, భవిష్యత్‌లో ఎవరినీ వదిలేది లేదని అన్నారు. సమావేశంలో నేతలు దిండిగాల రాజేందర్, లక్కినేని సురేందర్, జేకే శ్రీను, సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్, భావ్ సింగ్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, వల్లాల మంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజానికి తోడ్పడాలి


కేక్ కట్ చేస్తున్న సింగరేణి జీఎం శ్రీనివాస్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు సమాజానికి తోడ్పడాలని, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని గురువారం సింగరేణి పర్సనల్ జీఎం కోడూరి శ్రీనివాస్ రావు సూచించారు. సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 75 వసంతాలు పూర్తి చేసుకోవడంతో దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కౌట్స్ ఉద్యమ వ్యవస్థాపకుడు బెడెన్ పాల్ స్ఫూర్తి, ఆశయాలను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ పీఏ వరప్రసాద్‌రావు, స్కౌట్ మాస్టర్లు, గైడ్స్, క్యాప్టెన్లు, రోవర్స్, లీడర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని ప్రారంభించిన డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ సందర్భంగా గురువారం డీఈఓ వెంకటేశ్వరాచారి జెండా ఆవిష్కరించి, శాంతి ర్యాలీని ప్రారంభించారు. రోటరీ క్లబ్ సహకారంతో రైలాను, ట్రెక్కింగ్, డ్రాయింగ్, మెమరీ పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ – గైడ్స్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, నీరజ, ఏ. నాగరాజశేఖర్ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జెన్‌కో క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సీఈలు

పాల్వంచ: కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో కేటీపీఎస్ 7వ దశ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న టీజీ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కబడ్డీ, ఫుట్ బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కేటీపీఎస్ 5,6,7 దశలు, జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌లు సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, శ్రీనివాస బాబు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో నిత్యం తలమునకలై ఉండే ఉద్యోగులకు క్రీడా పోటీలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. ఈపోటీల్లో కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్, కేటీపీపీ, జూరాల, శ్రీశైలం, విద్యుత్ సౌధలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఈ యుగపతి, స్పోర్ట్స్‌ఆఫీసర్‌లు లోహిత్ ఆనంద్, మహేష్, వీరస్వామి పాల్గొన్నారు.

హోమ్‌గార్డ్ సతీమణి చికిత్సకు చేయూత


హోమ్‌గార్డ్ ఇన్‌చార్జికి నగదు అందజేస్తున్న ఎస్సై

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్ హోమ్‌గార్డ్ మాడుగుల సత్యనారాయణ సతీమణి అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా పోలీసు సిబ్బంది ఆర్థికసాయం అందించారు. భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ ఆధ్వర్యాన సిబ్బంది నుంచి సేకరించిన రూ.22 వేలను హోమ్‌గార్డ్ ఇన్‌చార్జి శేషుకు గురువారం అందజేశారు. ట్రాఫిక్ ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ: పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పాత పాల్వంచలోని ఓ ఇంట్లో బుధవారం పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. రూ.25,800 నగదు, రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

4 లీటర్ల సారా స్వాధీనం

టేకులపల్లి: మండలంలోని తొమ్మిదోమైలుతండాకు చెందిన నూనావత్ జగదీశ్ ఇంట్లో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించి నాలుగు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

50 శాతం చేప పిల్లల పంపిణీ పూర్తి


చేపపిల్లలు పంపిణీ చేస్తున్న ఇంతియాజ్

చంద్రుగొండ : జిల్లాలో 50శాతం చేపపిల్లల పంపిణీ పూర్తయిందని జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. చంద్రుగొండలో గురువారం మత్స్యసొసైటీలకు చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 689 చెరువులు ఉన్నాయని, అందులో 82 పెద్ద జలాశయాలు ఉన్నాయని చెప్పారు. మరో పదిరోజుల్లో 100 శాతం పంపిణీ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, సిబ్బంది కోటేశ్వరరావు, భార్గవ్ పాల్గొన్నారు.

పినపాకలో వెలిసిన మావోయిస్టు కరపత్రాలు

బూర్గంపాడు: మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ గ్రామంలో గురువారం మావోయిస్ట్ కరపత్రాలు కలకలం రేపాయి. మావోయిస్ట్ పార్టీ భద్రాచలం డివిజన్ పేరిట వెలిసిన కరపత్రాలలో గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని టార్గెట్ చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. గిరిజన భూముల ఆక్రమణలకు పాల్పడిన వారికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని కరపత్రాల్లో పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ మహిళపై దాడికి పాల్పడిన ఇద్దరిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని పాత నారంవారిగూడేనికి చెందిన బొండూరి దుర్గకు, అదే గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు–మల్లేశ్వరి దంపతులకు మధ్య పాతకక్షల నేపథ్యంలో గొడవ జరిగింది. ఈ క్రమంలోనే దుర్గపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో దాడికి పాల్పడిన వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చదువుకు దూరం కావొద్దని..

ఇంటినే బడిగా మార్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఆదివాసీ గ్రామపెద్ద


ఇంట్లోనే పాఠశాల నిర్వహిస్తున్న ఆంద్రయ్య

చర్ల: పాఠశాల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటం, వెళ్లే మార్గంలో అటవీ ప్రాంతం, వాగులు ఉండటంతో గ్రామ పెద్ద తన ఇంటినే పాఠశాలగా మార్చాడు. చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయతీలోని ఆదివాసీ గ్రామాలు రాజయ్యానగర్, క్రాంతిపురంలలో సుమారు 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా రెండు కిలోమీటర్ల దూరంలోని కొయ్యూరు పంచాయతీ సుందరయ్యనగర్‌లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రావాల్సి ఉంది. గ్రామాలు కూడా అటవీ ప్రాంతంలో ఉండటం, వచ్చి పోయే దారిలో వాగులు ఉండటం, పాములు తేళ్ల సంచారం అధికంగా ఉండటంతో పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు నిరాకరించారు. విద్యార్థులు చదువుకు దూరమవుతుండటంతో చలించిన రాజయ్యనగర్‌కు చెందిన గ్రామపెద్ద రేగా ఆంద్రయ్య తన ఇంటినే పాఠశాలగా మార్చేశాడు. మూడు రోజులుగా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్నాడు. దీంతో ఆంద్రయ్యను రెండు గ్రామాల ఆదివాసీలు అభినందిస్తున్నారు.

దూరం వల్ల..



రెండు కిలోమీటర్లు అడవిలో పిల్లలు బడికి పోవాల్సి వస్తోంది. వచ్చి పోయే దారిలో వాగు కూడా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతోనే పిల్లల్ని బడికి పంపడం లేదు.

–సబ్కా అనిత, రాజయ్యనగర్

అంత దూరం ఎలా వెళ్లాలి?



బడికి వెళ్లే దారిలో పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. కుక్కలు కూడా ఈ మార్గంలో సంచరిస్తున్నాయి. ఎవరినైనా కరిస్తే మా పిల్లల పరిస్థితి ఏమిటీ ? అందుకనే పిల్లల్ని అంత దూరం బడికి పంపించడం లేదు. –సోయం లక్ష్మయ్య, రాజయ్యనగర్‌కాలనీ

ఉన్నతాధికారుల దృష్టికి..



ఇప్పటివరకు ఈ విషయం నా దృష్టికి రాలేదు. రాజయ్య కాలనీ, క్రాంతిపురం గ్రామాలు సుందరయ్యకాలనీకి దూరం ఉన్న మాట వాస్తవమే. ఇక్కడి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– పీవీ రమణ, చర్ల ఎంఈఓ

బాధతోనే ఇంటి వద్ద పాఠాలు



స్కూల్ దూరం ఉండటం, వెళ్లేదారిలో భయపడుతుండటంతో తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడంలేదు. దీంతో మా గ్రామంలోని పిల్లలు చదువులకు, క్రమశిక్షణకు దూరం అవుతున్నారనే బాధతో వారికి చదువు నేర్పించాలన్న ఉద్దేశ్యంతో పాఠాలను చెబుతున్నాను. –రేగా ఆంద్రయ్య, గ్రామపెద్ద, రాజయ్యనగర్‌కాలనీ

పాము కాటుతో వ్యక్తి మృతి

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న వ్యక్తి పాము కాటుతో మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గట్టుగూడెం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గున్నేపల్లి గ్రామానికి చెందిన కొట్టె నాగేంద్ర బాబు(30) గట్టుగూడెం గ్రామంలోని వేరుశనగ వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందును స్ప్రే చేసే పనికి వెళ్లాడు. అతడు పనిచేస్తుండగా పాము కాటు వేసింది. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు వచ్చి సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

ఇల్లెందురూరల్: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. కుటుంబీకుల కథనం ప్రకారం.. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ ముకుందాపురం గ్రామానికి చెందిన యువకుడు జెన్ని పాలరాజ్ (17) ఇంటికి ఆలస్యంగా రావడంతో తల్లి లక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెంది గత నెల 28న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి అతన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించింది. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి


వెంకన్న (ఫైల్)

ఇల్లెందు: గుండెపోటుతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. ఇల్లెందు కాకతీయ నగర్‌కు చెందిన తిరుకోవళ్లూరు వెంకన్న(50)కు ఆరోగ్యం బాగలేకపోవడంతో ఆర్ఎంపీ, తన బామ్మర్ది సతీష్ వద్ద వైద్యం పొందారు. మధ్యాహ్నం ప్రభుత్వ వైద్యశాలలో కూడా చికిత్స పొందాడు. అనంతరం కొత్త బస్టాండ్ ఏరియాలో మిత్రులను కలిసేందుకు వెళ్లి అక్కడే కుప్ప కూలి పడిపోయాడు. మిత్రులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందాడు. వెంకన్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీప్‌కు సుదీర్ఘ కాలం పాటు డ్రైవర్‌గా పని చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకన్న మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ఆవరణలో బుధవారం మేతకు వెళ్లిన 15 మేకలు కలుషిత నీరు, విష వాయువు వల్ల మృతి చెందాయని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గురువారం పశువైద్యుడు సతీష్ ఆధ్వర్యంలో బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ సమక్షంలో మేకల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి

మణుగూరు టౌన్: మండలంలోని సమితిసింగారం పంచాయతీలో పిచ్చికుక్కల దాడిలో ఓ చిన్నారి గాయపడింది. స్థానికుల కథనం ప్రకారం... సీతానగర్‌కు చెందిన గడప విక్కీ–ప్రియ దంపతుల కుమార్తె జున్ను ఆరు బయట ఆడుకుంటున్న క్రమంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ముఖంపై గాయపరిచాయి. దీంతో తల్లిదండ్రులు 100 పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పిచ్చికుక్కల స్వైరవిహారం చేస్తున్న తీరు భయాందోళన కలిగిస్తోందని పంచాయతీ సిబ్బంది అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

పాల్వంచ: పట్టణ పోలీస్ స్టేషన్‌లో ముగ్గురిపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని జ్యోతి నగర్‌కు చెందిన మణెమ్మకు మరో ముగ్గురికి డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఈక్రమంలో కులం పేరుతో దూషించారని మణెమ్మ ఫిర్యాదు చేయడంతో గౌరి, చంటి, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

సంక్షేమ హాస్టల్‌లో కానిస్టేబుల్ వీరంగం

కొత్తగూడెంరూరల్: మద్యం మత్తులో ఓ కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మద్యం మత్తులో పక్కనే ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్లోకి ప్రవేశించాడు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అన్వర్‌ను, విద్యార్థులను బూతులు తిడుతూ చితకబాదాడు. విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ తీరుతో విద్యార్థులు ఆందోళనకు సిద్ధమవుతుండగా ఎస్ఐ రమణారెడ్డి అక్కడికి చేరుకుని శాంతిపంజేశారు. సమస్యను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకునేలా విధంగా చూస్తానని ఎస్ఐ హామీ ఇచ్చారు. కాగా కానిస్టేబుల్ నిర్వాకంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.